క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెబ్బేరు రూరల్: అమావాస్యను పురస్కరించు కొని వనపర్తి మండలంలోని చింతల ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం పల్లకీ సేవ, అభిషేకాలు నిర్వహించారు. ఉమ్మడి పెబ్బేరు మండలంలోని చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల దగ్గర భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్నదానం ఏర్పాటు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదానం చేశారు.

క్షయను అరికడుదాం



ఆత్మకూర్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, లక్షణాలు ఉన్న వారు నేరుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శరత్, సర్పంచ్ బుచ్చన్న అన్నారు. గురువారం మండలంలోని తిప్పుడంపల్లిలో క్షయ వ్యాధి నివారణపై కళాజాతా బృందంతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాకారులు ఆట, పాటలతో వ్యాధి గురించి క్లుప్తంగా వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులను ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం నిమిత్తం బాధితుల ఖాతాల్లో నెలకు రూ.500 జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ ఉన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి



వనపర్తి టౌన్: జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో దేశ రక్షణ రంగాన్ని ప్రతిష్ట పరచడంతో పాటు హరిత విప్లవానికి నాంది పలికిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సేవలు మరువలేనివని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రీ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, కిరణ్ కుమార్, కృష్ణ, పరశురాం, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ మాజీ అధ్యక్షుడి బహిష్కరణ ఉపసంహరణ

వనపర్తి టౌన్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డీసీసీ మాజీ అధ్యక్షుడు తైలం శంకర్‌ప్రసాద్ కాంగ్రెస్‌లో ఇక నుంచి క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. మాజీ మంత్రి చిన్నారెడ్డికి వ్యతిరేకంగా చేపట్టిన పలు కార్యక్రమాల్లో శంకర్‌ప్రసాద్ కీలకంగా వ్యవహరించాడనే అభియోగంతో గతేడాది ఆయనను పార్టీ నుంచి బహిష్కరిస్తూ పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అయినా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుండటంతో ఆయనపై విధించిన బహిష్కరణ ఉపసంహరించుకుంటూ పార్టీలోకి ఆహ్వానించినట్లు చిన్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

2 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ శివారులోని తాళ్లచెరువు నుంచి వనపర్తికి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు వెంకటేష్, సల్మాన్ పట్టుకుని కేసు నమోదు చేసి పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి అప్పగించారు. వనపర్తి పట్టణ శివారులోని తాళ్లచెరువు నుంచి కాశీంనగర్‌కు చెందిన శ్రీరాములు, సుగ్రీవ మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకగా తయారుచేసి అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు అనుమతి పత్రాలు చూపించమని అడుగగా.. సరైన పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అక్షతల పంపిణీ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని పురవీధుల గుండా చెన్నకేశవ భజనమండలి సభ్యులు భక్తి పారవశ్యంతో కూడిన గీతాలను పాడుకుంటూ ఇంటింటికీ తిరుగుతూ అయోధ్య రాములోరి తలంబ్రాలను పంపిణీ చేశారు.
పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురంలో భక్తులతో కలిసి అయోధ్య రామయ్య అక్షతల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భగవంతుయాదవ్, నాగరాజుయాదవ్, భగవంతు పాల్గొన్నారు.



దావాజిపల్లిలో..



వనపర్తిలో..



అమరచింతలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న రంగవల్లులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తుగా సంక్రాంతి సంబురాలు నిర్వహించుకున్నారు. 56 మంది బాలికలు విభిన్న ఆకృతుల్లో రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో అందంగా అలకరించారు. పాఠశాలలోని బాలురు పోటీపడుతూ గాలిపటాలను ఎగురవేసి సంబురంగా గడిపారు. విద్యార్థులకు సంక్రాంతి విశిష్టత తెలియజేసేందుకు వేడుకలు నిర్వహించామని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పావని, భవిత, ద్వితీయ బహుమతి గౌతమి, అంజనసౌమ్య, తృతీయ బహుమతి జోష్న, షమీత్ర గెలుపొందారు. అదే విధంగా రేడియంట్ పాఠశాలలో, మాస్టర్‌మైండ్ పాఠశాలల్లోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, మహిపాల్‌రెడ్డి, కవిత, లక్ష్మి, శ్రీలత, అంజనేయులు, శ్రీహరి, కరస్పాండెంట్ గౌతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు అలరించాయి. విద్యార్థినులు వేసిన ముగ్గులు వేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురపాలిక చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్ తబస్సూంమోసీన్, ఎంఈఓ భాస్కర్‌సింగ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంలు విష్ణువర్ధన్‌రెడ్డి, కొండాపురం బాలరాజు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.
అమరచింత: మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు పండుగల ప్రాధాన్యత వివరించారు. పట్టణంలోని విజేత హైస్కూల్‌లో చిన్నారులకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు.
పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు హెచ్‌ఎం బద్రూనాయక్ తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ వెంకటయ్యయాదవ్ సందర్శించి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.
కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల జెడ్పీహెచ్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం గోపాల్ తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన కృష్ణవేణికి మొదటి బహుమతి కింద రూ.2వేలు, రాజేశ్వరికి ద్వితీయ బహుమతి కింద రూ.1,500, ఇందు తృతీయ బహుమతి కింద రూ.1000 నగదును ఎంపీపీ గుంత మౌనిక స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హిమబిందు, ఎంపీటీసీ చిట్టెమ్మ, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవరెడ్డి, భీంరెడ్డి, సాక బాలనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి



అప్పరాలలో..

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పాన్‌గల్: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఫోరం లేక వాయిదా వేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు పేర్కొన్నారు. సమావేశం మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియపర్చనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి వచ్చే అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన సూచించారు.

కంటి వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, వైద్యులు

ఆత్మకూర్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వివేకానంద సేవాసమితి, నేత్రం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీవాణి ఉన్నత పాఠశాలలో మొత్తం 175 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 48 మంది విద్యార్థులకు కంటి చూపు లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాస్టర్‌బాలు, జిల్లాకార్యదర్శి రాజేష్, నేత్రం ఫౌండేషన్ నిర్వాహకులు రమేష్, పుష్పగిరి, మణికంఠ, పాఠశాల కరస్పాండెంట్ టీజే విశ్వేశ్వర్, ప్రిన్సిపాల్ గంగాధర్, వైస్‌ప్రిన్సిపాళ్లు శ్రీమాలిని, శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన ఆధ్వర్యంలో మ్యాజిక్‌షో

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, బాలుర, బాలికల ఉన్నత, మోడల్ పాఠశాల నందు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రయ్య విద్యార్థులకు గణితంలో భయం పోగొట్టడానికి స్పీడ్ మ్యాథ్స్ ఆధారంగా సులభంగా గణిత లెక్కలను ఏవిధంగా చేయాలో వివరించారు. అదే విధంగా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మ్యాజిక్ షో ఏర్పాటు చేశారు. మంత్రగాళ్లు, మోసగాళ్లు, దొంగ బాబాలు చేసే వివిధ రకాల జిమ్మిక్కుల వెనక ఉన్న సైన్స్ రహస్యాన్ని పిల్లలకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగేష్, వీరస్వామి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పిస్తున్న చంద్రయ్య

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెబ్బేరు రూరల్: స్వామి వివేకానంద హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తిత్వ వికాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలారాణి, తహసీల్దార్ మురళీగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ యూత్ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రంగౌడ్, లెక్చరర్ కురుమూర్తి, శరత్, పీఆర్టీయూ మండల కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జగన్మోహన్

అమరచింత: గ్రామంలో జరిగే చోరీలతో పాటు నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఎంతో అవసరమని ఎస్‌ఐ జగన్మోహన్ అన్నారు. మండలంలోని నందిమళ్లలో గురువారం సీసీ కెమెరాల అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజులు కిందట పట్టపగలే తాళం వేసిన ఇంటికి కన్నం వేసి బంగారు నగలతో పాటు నగదును చోరీ చేశారని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులతో పాటు కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఉంటే నిందితులను పట్టుకునేందుకు అవకాశం ఉండేదన్నారు. గ్రామంలోని ప్రజలందరూ విరాళాలు అందించి సీసీ కెమెరాలను ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జమీరుద్దీన్, హెడ్‌కానిస్టేబుల్ వలీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలో వాటా కావాలని తమ్ముడి నిరసన

అమరచింత: ఉమ్మడి ఇంటిని తనకు తెలియకుండా తన అన్న ఆయన పెద్ద కుమారుడి పేరుపై ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఏమిటని, ఉమ్మడి ఇంట్లో వాటా కావాలని ఇంటి ఎదుట గురువారం తమ్ముడు నిరసన వ్యక్తం చేసిన ఘటన అమరచింత పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన బి.నిస్సార్, బి.నసీర్ అన్నదమ్ములు. వీరికి గతంలో ఇందిరమ్మ ఇంటి స్థలాన్ని బీసీ కాలనీలో కేటాయించారు. తండ్రి బుక్క బడేసాబ్ పేరున ఇంటి స్థల పత్రాలు అందించారు. వీటిని సామూహికంగా ఇంటిని నిర్మించుకున్నామని, ప్రస్తుతం ఇంట్లో తనకు వాటా ఇవ్వడం లేదని నిస్సార్ తన అన్నతో వాదించగా.. ఇల్లు తన పేరున లేదని తన కుమారుడి పేరున ఉందని చెప్పడంతో కంగారు పడ్డాడు. విషయాన్ని మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో అక్రమంగా ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించాడు. కొన్నేళ్లుగా తనకు ఇంట్లో వాటా ఇవ్వాలని కోరినా పట్టించుకోక పోవడంతో తనకు న్యాయం జరగాలని భార్యతో పాటు కలిసి అన్న ఇంటి ఎదుట కూర్చొని నిరసన వ్యక్తం చేశారు.



ఇంటి ఎదుట భోజనం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న భార్యభర్తలు

బండపల్లిలో చోరీ: కేసు నమోదు

పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో చోరీ ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మండ్ల పద్మ, నర్సింహ హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పని నిమిత్తం ఈనెల 6వ తేదీన హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చారు. పని పూర్తైన తర్వాత వెండి గొలుసులు, రూ.16 వేల నగదును ఇంట్లో బీరువాలో పెట్టి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో హాస్టల్‌లో ఉన్న తమ కుమారుడు ఇంటికి వస్తాడు అని బుధవారం రాత్రి పద్మ స్వగ్రామానికి వచ్చింది. ఇంటికి ఉన్న తాళం లేకపోవడం, ఇల్లు తెరిచి చూడగా ఇంట్లో ఉన్న వస్తువులు, బీరువా చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న 32 తులాల వెండి గొలుసులు, రూ.16 వేల నగదు కనపించలేదు. వీటి విలువ నగదుతో కలిపి రూ. 48 వేలు ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీంతో వేలిముద్రలను సేకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ, క్లూస్ టీం

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పెబ్బేరు రూరల్: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన జిల్లాకేంద్రంలోని భగీరథ విగ్రహం వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దమందడి మండలంలోని మదిగట్లకు చెందిన మాచర్ల అశోక్ కొత్తకోట రోడ్డులోని భగీరథ విగ్రహం వద్ద ఉన్న కారు సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం బైక్‌పై టౌన్‌లోకి వెళ్లి అన్నం పార్సిల్ తీసుకొని వస్తున్న క్రమంలో కొత్తకోట వైపు నుంచి అతి వేగంగా వస్తున్న కారు బైక్‌కు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో అతడు కింద పడి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి మాచర్ల చిన్న బాలయ్య గురువారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వడ్డె ఓబన్నకు నివాళి



మదనాపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయం వద్ద స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 217 జయంతి వేడుకలను గురువారం దేవరకద్ర నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డె కృష్ణయ్య ఆధ్వర్యంలో వడ్డెరులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్, శాంతన్న, బాలస్వామి, వెంకటేష్, తిమ్మరాజు, రాజు ఉన్నారు.
ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భీమయ్య, జెడ్పీటీసీ సామ్యనాయక్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ క్యామ రాజు, కృష్ణయ్యగౌడు, అంజనేయులు, నర్సింహ, లోకయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీ చట్టానికి తూట్లు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని పాల కేంద్రం వద్ద గురువారం అజయ్ అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫీల్డ్ అసిటెంట్లు, సీనియర్ మేట్లు, ప్రజా సంఘాల నాయకులు, తెలంగాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిటెంట్ల జిల్లా అధ్యక్షుడు ఆనంద్, సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, పరమేశ్వరాచారి, రాజు, వాసిరాం, డీవైఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ మహేష్, శంకర్ ఉన్నారు.

ఆర్థికంగా రాణించాలి

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకంలో భాగంగా రుణాలు పొంది వ్యాపారులు, నిరుద్యోగులు ఆర్థికంగా రాణించాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మహ్మద్ అబ్బాస్ అలీ, ఫీల్డ్ ఆఫీసర్ మదన్‌మోహన్ అన్నారు. గురువారం ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో ముద్ర లోన్ మేళా నిర్వహించారు. రుణ సౌకర్యానికి ప్రభుత్వ ఉద్యోగి జామీను, ఆస్తి తనఖా అవసరం లేదని స్పష్టం చేశారు.

బయోడిగ్రేబుల్ ఫ్లెక్సీలనే ఏర్పాటు చేయాలి

వనపర్తి టౌన్: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రోడ్ల విస్తరణ, చెరువుల సుందరీకరణ, పట్టణాభివృద్ధి, పరిశుభ్రతకు పాటుపడ్డారని.. కానీ నేడు ఇష్టానుసారంగా పట్టణంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణం ఇష్టారీతిగా వెలుస్తున్న ఫ్లెక్సీలను కట్టడి చేయాలని గురువారం బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో బయోడిగ్రేబుల్ (భూమిలో నిక్షిప్తమయ్యే) ఫ్లెక్సీలను మాత్రమే ఏర్పాటు చేసేలా నిబంధన పెట్టాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



రామన్‌పాడులో ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడుకు చెందిన శ్రీనునాయక్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి పంపిన రూ.5వేల నగదును గురువారం మృతుడి భార్యకు చాపల శ్రీధర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కురుమన్న, కష్టారెడ్డి, వస్తంనాయక్, రామునాయక్, కిషన్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాములు, మాసన్న, లచ్చిరామ్ నాయక్, రాజునాయక్, నందునాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.
పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన గౌతమ్‌నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో తెల్లరాళ్లపల్లిలోని లిటిల్‌స్టార్ ఉన్నత పాఠశాల యాజమాన్యం రూ.15వేలు, తండా సర్పంచ్ శాంతమ్మ రూ.20వేలు, బాలునాయక్ రూ.10వేలు మొత్తం కలిపి రూ.45 వేల ఆర్థికసాయాన్ని గురువారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో బాల్యనాయక్, బాలునాయక్, రవితేజ, రాజునాయక్, సోమ్లానాయక్, వినోద్, రవి పాల్గొన్నారు.



పామిరెడ్డిపల్లిలో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన వడ్డె స్వామి అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.5వేలు, మాజీ మంత్రి చిన్నారెడ్డి తనయుడు జిల్లెల ఆదిత్యారెడ్డి రూ.3వేల ఆర్థికసాయం పంపించారు. కాంగ్రెస్ నాయకులు గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, మల్లెల నాగిరెడ్డి, సందడి లక్ష్మారెడ్డి, తిక్కన్న, రమేష్‌గౌడ్, శ్రీశైలం, యాదగిరిగౌడ్, వెంకటయ్య, మల్లయ్య, మన్నెం, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.
పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన కటికె గోపాల్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పందించి రూ.5వేల ఆర్థిక సాయం పంపించారు. దీంతో సర్పంచ్ సత్యంయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు గురువారం గ్రామంలో మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మదనాపురం: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, వారిని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం సీఐటీయూ 2024 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను హమాలి కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం తమ జీవన ఉపాధి కోసం పోరాడే హమాలీలకు గుర్తింపు కార్డులు, 60 ఏళ్లు నిండిన కార్మికుడికి రూ.6వేల పింఛన్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాగరాజు, నరేందర్, తిరుపతి, మన్నెం, ఆంజనేయులు, విజయ్, వెంకటస్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.
కొత్తకోట రూరల్: సీఐటీయూ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ గురువారం మున్సిపల్ కార్మికులు, సిబ్బందితో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా మున్సిపాలిటీల్లో కార్మికులు చాలిచాలనీ వేతనాలతో పనిచేస్తున్నారని, ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. కార్మికులకు ఖచ్చిత వేతనం కింద రూ.21వేలు ఇవ్వాలని, అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆనందర్‌రాజు, రమేష్, శివ, రాజు, వెంకటయ్య, కొండన్న, డేవిడ్, రమేష్, శ్రీను, శిరీష, సరళ, మన్నెమ్మ, సుశీల, పద్మ, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వివేకానంద జీవితం ఆదర్శం

వనపర్తి టౌన్: నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో, స్థానిక మహిళ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని వేరువేరుగా ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు బైరోజు చంద్రశేఖర్, బంగారు శ్రీనివాస్, రాములు యాదవ్, నరసింహయ్య, రంజిత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మంజుల, రూప, కళాశాల అధ్యాపకులు, బాల భవన్ సిబ్బంది లావణ్య, ప్రసన్న, నిరీశ, శాజీద బేగం, వాజీద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు